
# రెండు మరణాలు

-అల్లం వీరయ్య




ఈ భూమ్మీది జీవరాసులన్ని కాక నాకు చిత్రంగా జలచరాలైన నత్తలు మాత్రమే పదే పదే గుర్తొస్తాయి. భావుకులైన మనుషులకు మబ్బులుకమ్మిన ఆకాశం - కొండలమీదుగా లోయల్లోకి పారే వెన్నెల - పురివిప్పిఆడే నెమలి - పరుగులెత్తే జింకలు ఇలాంటివో మరెలాంటివో మొత్తానికి అందమైన ఊహలు కదులుతుంటాయంటారు. నాకు ఎంత వద్దనుకున్నా - శీతాకాలంలో తెల్లటిమంచుతో కప్పబడిన హిమాలయాలనుండి మంచు ఎండకు కరిగికరిగి కదలివట్లుగా । మృదువుగా, తెల్లగా అత్యంత పరిశుభ్రంగా తళతళలాడే నత్తే నా అంతరంగంలో మెదులుతూ ఉంటుంది.

నత్తమీదుగా నా ఆలోచనలు వాన పాములు, చేపలు, ఎప్పుడు ఎక్కడ నీటిలో కాలుపెట్టినా ఒళ్లు జలదరించే జలగ దగ్గర ఆగిపోతాయి.

మనుషులంతా తమ భవిష్యత్తు గురించి - కిందవాళ్లు రేపు గడవడం గురించి - పైవాళ్లు షేర్ల గురించి కార్ల గురించి బార్ల గురించి - మధ్యవాళ్లు తీరని రకరకాల తమ కలల గురించి అదేపనిగా మాట్లాడుకుంటుంటారు. కాని నేను ఆకలల్లో - ఆ మాటల్లో ఇమడలేక ఒంటరి వాడినైపోతున్నాను. పైగా ఈ నత్తలు, జలగలు నా మెదడ్లో చేరిపోయి - నా ఉపమానాలన్ని వీటి చుట్టే తిరగడం వలన మావాళ్లో అంతమందిలో నేను చిత్రమైన ప్రవాసం గడుపుతున్నట్టే లెక్క.

నా లెక్కలునావి - నా పరిశీలనలు నావి.

అందరికి ఎడంగా నిలబడి చూస్తున్నట్టే ఉంటుంది.

నేను ఇట్లు తిరుగుతుండగానే నేను మా పల్లెనుండి ఈవూరొచ్చాను. ఈ వూరు గ్రామదశనుండి తాలుకాగా, తాలూకా నుండి డివిజన్ దాకా ఎదిగిన క్రమంలో కూడా నత్తలు, జలగలు మనసులో కదులుతాయి.

తారురోడ్డు బాగా రక్తం పీల్చి కదలకుండ పడుకున్న జలగలాగా దానికిరుపక్కల భవన సముదాయాలు జలగ కవ్వు కున్న నత్తగుల్లలుగా రూపుకడుతాయి.

ప్రధాన వీధిలో నిలబడిన బిల్డింగులు - బిల్డింగుల్లోని దుకాణాలు, బ్యాంకులు ఆఫీసులు, సారా, బ్రాందీ, బట్టల, కిరాణా అన్ని భవనాలు జలగలు కవ్వుకున్న నత్తగుల్లల్లాగే కన్పిస్తాయి. వీధి చివర ఎర్రరంగు రక్షకభట నిలయం ఒక్కటే నత్తగుల్ల ముసుగులేని జలగ తలలాగా కన్పిస్తుంది. ఆ భవనాల్లోకి వచ్చిపోయే మనుషులు జలగ శరీరంలో కదలాడే రక్తంలా కన్పిస్తారు. వద్దనుకున్నా - ఎంతకాదనుకున్నా -, అసహ్యించుకున్నా, రోదించినా, కోపంతో బుసలు కొట్టినా మనుషుల యిష్టాయిష్టాలతో పనిలేకుండా మళ్లీ మళ్లీ ఆ రోడ్డుమీద మనుషుల కాళ్లు తిరుగాడుతాయి. మనుషుల దేహాలు అనత్త దొల్లల భవనాలకిందికి పోయి పాలిపోతూనే ఉంటాయి.

అదే రోడ్డుమీద నేనీ అసంబద్ధ జీవరాసుల మధ్యలో తచ్చాడుతూవుంటే మాజాతి వాళ్లు కొందరు జలగ దేహంమీద నిలబడే జీతాల గురించి, టియే, డియేల గురించి ఇంక్రిమెంట్ల గురించి లెక్కర్లిచ్చు కుంటుం టారు.

మారేకాలంతోపాటు జలగలు, నత్తలు మారక తప్పదని లామార్కు, డార్విన్, డివ్రిస్, మెండల్ చెవులిల్లు కట్టుకుని చెప్పారని మా సైన్సుటీచర్ సుబ్రమణ్యం చెప్పుతుంటాడు, చిన్నచిన్న శబ్దాలు పరిణామక్రమంలో మారి మారి మహమ్మారిలాంటి ఉపన్యాసాల్లాగా మారాయని మా సుబ్రమణ్యంను చూసి చెప్పవచ్చు. అంగవిన్యాసం తప్ప నాకు మాటలు వినపడవు. ఆ అంగాలు కూడా నత్త మీసాల్లాగా బయటకు చెప్పగలమా?

అతను చెప్పినదాంట్లో పిసరంత సత్యం ఏమిటంటే ఇరవై సంవత్సరాలక్రితం తలుపులు దర్వాజులు గూనపెంకులు మాత్రమే గల కిరాణా దుకాణాలు తొండ ముదిరి ఊసరవెల్లులైనట్లు షట్టర్ల, సైన్‌బోర్డులతో, రిన్, డెట్ల అడ్వర్‌టైజుమెంట్ల గోడలతో బలిసిపోయాయి. శారదా విలాస్, అన్నపూర్ణ హోటల్ల పూర్వనామధేయం లచ్చుమ్మ, బుచ్చమ్మ హోటల్లే - మెంతుల రాజయ్యగారి పుస్తకాల దుకాణామిప్పుడు సత్యం బుక్‌షెల్లర్‌గా, కొక్కుల రామయ్య తాకట్టు దుకాణం క్రాంతి ఫైనాన్సయింది. దొంతుల లింగయ్య గారి కిరాణా దుకాణం వెంకటేశ్వర జనరల్ స్టోరయ్యింది. కొత్తగా రాజాజీలా డ్జి, శ్రీనివాసా ఫెర్టిలైజర్స్, రామకృష్ణా ఐరన్ అండ్ సాఫ్టువేర్, శిల్పీ ఫోటోస్టూడియో ఇట్లా చదువుతూ పోతూ పోతూ నాకళ్లు అక్కడ ఆగిపోతాయి....

ఔను! ఆ షట్టరును గత ఆరునెలలుగా ఎవరు తెరువడం లేదు. లోలోపల ఏదో మరేదో సుళ్ళు తిరుగుతుండగా నాదృష్టి క్రమంగా మౌనంగా భారంగా పక్కకు జారుతుంది.

ఆ పక్కగడ్డి గుడిసె శిధిలమౌతూ చెదిరిపోతున్న కప్పు ఆ గుడిసె రేకు గ్రిల్ రెక్కలు కూడా గత ఆరునెలలుగా మూతపడేఉన్నాయి.

రోడ్డుమీద దుకాణాలల్లో కలగాపుల గంగా మంద్ర, తీవ్రస్థాయి గొంతులతో మనుషులంతా మాట్లాడుతూనే ఉన్నారు.

నాలోపలలోలోపల ఆ మూసిన షట్టర్ల వెనుక గూడుకట్టుకున్న భయంకర నిశబ్దం రూపుకడుతుంది.

ఆ గుడిసె గుండెలో గుబులు నాకు మాత్రమే తెలుసునా? కొద్దిగా కదిలించినా - కొద్దిగా నా చూపులతో పలకరించినా అక్కడ శిధిలావస్థలో గోడకొరిగి ఉన్న నాలుగు సైకిళ్లు చలనంలోకి వస్తాయని - మనిషి రక్తనాళాల్లా బయటకు తీసి ఉన్నట్యూబులు - పంక్చర్లు చేయకుండా మధ్యలో ఆపివేసిన ఆ ట్యూబులు ఊపిరిపోసుకొని రోడ్డుమీద పరుగెత్తుతాయని - ఇనుపడబ్బాలో రిపేరు సామాను గలగల కదిలివస్తుందని నాకు తెలుసు. కాని నాకు ఆ తుప్పుపట్టిన రేకుగ్రిల్ తలుపుల గుండా లోపలికి చూడాలంటే భయం. బహుశా ఆ భయం నుండే నత్తలు, వానపాములు, జలగలు నా అంతరంగంలో చోటు చేసుకున్నాయేమో?

❋ ❋

చిత్రమైన చిరపరిచితమైన గొంతులేవో విన్పిస్తున్నాయి. నాకు చెల్లాచెదురైన అనేక జీవన దృశ్యాలమధ్య - ఆ జ్ఞాపకం అచ్చు గుద్దినట్లుగా - రంగులు అద్దినట్లుగా ఉంది. కకావికలు కాక ముందటి అనుభవాలు ఏవైనా ఉంటే - అవి నేను ఉద్యోగంలో చేరిన మొదటి రోజులవే.

దాదాపు పదిహేను సంవత్సరాల కిందట మాట - ఇంటాబయట ఇరుకుగా లేనట్టు - ప్రపంచం విశాలమైందని - కింద భూమి, పైనాకాశం మాత్రమే తెలిసినప్పటిమాట - ఉద్యోగం కొత్త - ఉబలాటాలు కొత్త - ఊహలు పాతవే - నేనిక్కడ పాతవాడినే.


గొంగళి పురుగు దశలు గడిచిన సీతాకోక చిలుక వయస్సుకు ఎగరడానికి ఉబలాటం - ఉరుకులాట కొత్తది గాని - లార్వా పూర్వపు దశలన్ని ఇక్కడ గడిచినవే.

ఎంతో చెప్పాలని, ఏదో చెయ్యాలని, - అతి భక్తిశ్రద్ధలతో వృత్తిని ప్రారంభించిన అమాయకపురోజులు.

తరగతి గది - ఎదిగీ ఎదగని పిల్లమంద - ఆ ముఖాలమీద అమాయకత్వంతోపాటు అల్లరి - నవ్వులతోపాటు ఉబలాటం. అవి ఎర్రిముఖాలు - ఒరకంగా గుర్రిముఖాలు ....కాని కాని రమణను చూస్తే మాత్రం నాకెప్పుడు హడలే.

వాని నవ్వులో నాకు ఎగతాళి కన్పించేది. వాని ప్రశ్నల్లో విప్పరాని చిక్కులు - వానిమాటల్లో నాకందని ఎత్తులు - వాడు అప్పుడే చిన్నప్పుడే నాకొవిడదీయరాని 'ఫజిల్'

"సార్! శ్రీ సరస్వతీశిశుమందిర్ అని ఎందుకు పేరు పెట్టారు - శ్రీమతి సరస్వతి శిశుమందిర్ అని ఎందుకు పేరు పెట్టలేదు'



రమణ.

"ఔను కారణమేమిటి? పాఠశాల అన్న పదంలో 'శ్రీ' వస్తుందికాబోలు అనుకున్నా కుదిరిచావదే - పాఠశాల స్త్రీలింగమా పుల్లింగమా" నేను.

"కృషితో నాస్తి దుర్భిక్షం" అని బిగ్గరగా చదివి వాడు "కృషితో న+అస్థి దుర్భిక్షం" అని విరిచి చదివి వ్యతిరేకత ధ్వనింపచేసేవాడు.

'నోరెల్లబెట్టేది నేను. 'నాస్తి'ని అస్థిగా మార్చి నా ముఖంమీద భావాలు చదవడం వానిపని. ఈ పదాల విరుపులో తప్పొప్పులు తటాలున స్ఫురించక తడముకోవడం సరేసరి - పోనీ ఏదో ఒకటి 'చారుతులసీదళం' పద్యం చెప్పితప్పించుకుందామనుకుంటే వాడు గణపతికాదు - సందేహాలపుట్ట - మరోప్రశ్న రానేవస్తుంది.

"బస్సులో పొగత్రాగరాదు అంటే బస్సులోపలి పొగత్రాగరాదా? బస్సులో పొగత్రాగితే పొగరాదా? త్రాగరాదా?"

'జరబస్సులో పొగత్రాగండి ప్లీజ్' అని వాని మిత్రులకు నాతో చెప్పించాలని వాని ఎత్తుగడ.

వాని నిశిత దృష్టికి ఆశ్చర్యం వేసేది - వాని పదాడంబరానికి భాషా నైపుణ్యానికి అబ్బురమన్పించేది.

"మాతెలుగు తల్లికి మల్లెపూవుదండుగ' అని వాడురాగయుక్తంగా పాడితే కోపం వచ్చేది.

''ఒరే - ఒరే రమణా నీవు సామాన్యుడివిగాదురా కాలాంతకుడివి" సైన్సు, గణితం, ఆంగ్లం, సాంఘీక శాస్త్రాల టీచర్లంతా నాతోపాటు తీర్మానించి పారేశారు.

"అక్బర్ కాలంలో తాజ్‌మహల్‌మీద ఒక చుక్క నీళ్లు పడని కారణాన్ని" చప్పున చెప్పలేక ఓడిపోయిన చారికి రమణ గాడంటేమహా చెడ్డభయం.

''ఆడపిల్లా, మొగపిల్లవాడు'' అన్నమాటలోని శబ్దదోషాన్ని'' ఎత్తిచూపినపుడు ప్రభుత్వం కుష్టుకేంద్రం అంటే ప్రభుత్వానికేం రోగం సార్! కుష్టు వేరే ప్రైవేట్ కుష్టు వేరేనా?''అనే టెంపరితనానికి ఏంజవాబులు చెప్పాలో మాకు తెలిసేదికాదు.

వాడు సామాన్యుడు కాదనుకున్నా - వాడు భాషా పండితుడనుకున్నా లెక్కలసారు వానిలో గొప్ప ఇంజనీరును కనుగొన్నా! చారికి వానిలోపల గొప్పరాజకీయనాయకుడు కన్పించినా - సైన్సు టీచరు వానిలోపల శాస్త్రవేత్తను ఊహించుకున్నా -

వాడు ఎవరేమనుకున్నా నలుగురిలో నిత్య చైతన్యంగల ప్రత్యేక మూలకం - వాడు మహావిస్ఫోటాన్ని కడుపులో దాచుకొని పగలబోయే అగ్నిపర్వతం.


ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేటు తీసుకొని వాళ్ల నాన్న వెంటపోతూ, నావద్ద ఒకే ఒక నిమిషం నిలబడి "వెళ్లొస్తాసార్ - నన్నుమరిచిపోవద్దు' 'అన్నప్పుడు నా మనసు పరిపరివిధాల దేయి పోసుకున్నది.

ఆ మరునాడు అలాంటి రమణ వాళ్లస్వంత బ్రాందీషాపు కౌంటర్ ముందు కూచున్నాడు. వాన్ని ఆ కౌంటర్‌మీద చూసినప్పుడల్లా వాడి పాదరసంలాంటి మెదడు - చిక్కు ప్రశ్నలు పొటెత్తేవి. అప్పటినుండి ఆ కౌంటర్ వెనుకాల పదేపదే రమణను చూస్తే మనసు విలవిలలాడేది. ఒక వేడినిట్టూర్పు మినహా నా విద్యార్థుల 'జీవిక' ఎంపికలో నేను చేయగల్గిందేమున్నది?

రమణ తండ్రి కృష్ణమూర్తి ఊసరవెల్లి అవతారమెత్తుతున్న ఆ పట్టణంలో మంచి బిజినెస్ మాగ్నెట్ బ్రాందిషాపు దానిపైన లాడ్జింగ్ ఐరన్ నుండి ఎరువులదాకా విస్తరిస్తున్నవాడు. ఆ విస్తరణలో రమణగానికి అక్షరజ్ఞానం తప్ప చదువుకింద అణిగిపోవడం వద్దుతన యావదాస్తిని చతురతో నడుపగల "రఫ్ అండ్‌టఫ్" కావాలి.

బడిలో బల్లలమీద కూర్చునే పిల్లవాడు లోకజ్ఞానాన్ని కోల్పోయి వ్యర్థుడౌతాడని అతని నమ్మకం. చేతులుకాలాక ఆకులుపట్టు కోవడం తెలివితక్కువ బ్రాందీ వ్యాపారానికి గాంధీ చదువులకు పొత్తు కుదరదని మొక్కలోనే పక్కలో ఏముందో ఎదురుగా ఏముందో వ్యాపార రహస్యాలన్నీ తెలుసు కోవాలని అతని థీరీ.

ఫలితంగా ఉదయం తొమ్మిది నుండి రాత్రి పన్నెండు గంటలవరకు రమణ చైతన్యం క్రమంగా ఆ బ్రాంది షాపులో పాతుకపోయింది.




గత పదిహేను సంవత్సరాలుగా మనిషికుండే ఉత్సాహం, సహజమైన స్వచ్ఛమైన తెలితేటలు, చిత్రమైన చురుకుదనం ఘనీభవించి ఐసుముక్కలుగా మారి త్రాగుబోతుల గ్లాసుల్లో చేరాయి. బీద బిక్కి, మంచి చెడు, పరిచితుడు, అపరిచితుడు, తన, పరాయి బేధం లేకుండా నిర్విరామంగా ఇతరుల జేబులుఖాళీ చేయించి రమణగల్లా పెట్టె బరువు పెంచే నవీన ఆర్థిక సూత్రమైంది. వాడిచైతన్యం కృష్ణమూర్తిబ్యాంకుబ్యాలెన్సును పెంచింది. కృష్ణమూర్తి ఊహించినట్లుగానే రమణ గాడి తెలివి బంగారు గుడ్లు పెట్టే బాతయ్యింది.

మా రమణ - లోలోపలెక్కడో నిలిచి పోయిన మహాద్భుతమైన రమణ కాదు ఆ రమణ లోపల సమస్త చలనగతులు ఆగిపోయి మరణం అనే ప్రక్రియ అపుడే ఆ బ్రాంది షాపు కౌంటర్‌మీదే మొదలయ్యిందని నా అనుమానం.

"వీడెన్ని రూపాయలు సంపాయించాడో?' ' నలుగురు అనే మాట.

"వీడెన్నిసార్లు మరణించాడో?'' నా అంతరంగం ఘోషించేది.

కాలం ఎవరికోసము ఆగదు . అది ఎప్పుడు ఒక్కలాగే ఉండదు. కొందరి కంచాల్లో కోడి పలావైకూచుండేది - మరికొందరికి ఎగిరివచ్చే ఎంగిలాకయ్యేది - ఒకరికి ఖరీదైన బతుకు మరొకరికి నిప్పులకుంపటిగా అవతారమెత్తేది కాలమే.

నా చిన్నతనంలో మా పల్లెలో 'తాటికల్లు' అదీ తప్పుచేస్తున్నామన్న స్పృహతో ఇద్దరో ముగ్గురో తాగేవారు అయినా ఆ యిద్దరు ముగ్గురు తాగుబోతులుకారు. ఆ సంఖ్య ఇప్పుడు తాగని వాని కొచ్చింది. 'పసిపిల్లవాడు పాలకుబదులు సారా' తాగేరోజులొస్తాయంటే అతిశయోక్తి కాదేమో?

అజ్ఞానాన్ని, అమాయకత్వాన్ని ఆసరా

చేసుకొని రచించిన సారాజాలంలో నిండా మోసపోయిన వాడు సామాన్యుడు. వాడు ప్రజాస్వామ్య(పుగాలానికి చిక్కిన చేప, ప్రభుత్వం దాని వివిధ యంత్రాంగం పక్షి భాష మాట్లాడినా కూడ పులిజాతి జంతువే. గత నలభై అయిదేండ్లుగా వీధికొక్క సారా దుకాణం వాడకొక బ్రాంది షాపు ప్రజాస్వామ్యాల సాంస్కృతిక పునరుజ్జీవనం లేదా అభివృద్ధి.

ఊళ్లకూళ్లనే తాగుబోతులను చేయగల సత్తా ఎవరికుంటుంది. పైగా సారావల్ల జరిగే అనర్థాలను తన మీడియా ద్వారా ప్రచారం చేయగల సత్తా ఎవరికుంటుంది. పంట పొలాలల్లోకి పారే నీటి కాలువల్లో నీళ్లు రావు. తాగిన వాళ్లు అడుగలేరు. అస్పృహలో లేరు. ఎరువుల బస్తాకు మూడుసార్లు రేట్లుపెరిగినా తాగేరైతులు అడుగజాలరు. పంటచేలు నకిలీమందులతో సర్వనాశనం అయినా - గిట్టుబాటు ధరలు లేకపోయినా - పల్లెలు నిట్టనిలువునా కూలిపోయినా - కాలిపోయిన .......

పొట్టమీదున్న వరిపొలం కళ్లముందు ఎండిపోతున్న - బిడ్డపెళ్లికాదు. కొడుకు ఉన్న ఊళ్లో ఉండలేడు, బయట బతుకలేడు. భూములు పోతూనే ఉన్నాయి. లోలోపల వేళ్లకు పురుగులు తగిలి పైకి చెట్టు ఎండి పోయినట్టు సమస్తం కుప్పకూలుతున్నప్పుడు మనుసులో మంటేదో మండుతున్నప్పుడు - ఇదంతా మరిచిపోవాలంటే దీన్నుండి పారిపోవాలంటే తాగాలె.

ఈ బలహీనత ప్రభుత్వాలకు తెలుసు. ఈ బలహీనత రమణకు బాగా తెలుసు.

అందుకే రమణ మంది చావుబతుకుల రహస్యంతో ఆడుకోదలుచుకున్నాడు. అందుకే మందిలో కలువక - శ్రమతో, సృష్టితో కలువక సకలచలనాలు ఆగిపోయి - అప్పుడే రమణ చావు ఆరంభమయ్యిందన్నమాట.

* *

రమణ గురించి ఆలోచించినప్పుడల్లా చిత్రంగా మరొకరూపం నా మనసులోమెదులుతుంది.

చివరి బెంచీలో నిద్రమొహం, నీరసపుకాళ్లు, మాసిన పిడికెడు ఒళ్లు, ఒళ్లంతా గజ్జిపుళ్లు, నీళ్లల్లోనుండి తీసి ఒడ్డునవేసిన చేపలాగా - మూర్తీభవించిన జడత్వం - ఏతావాతా కూడిన తీసివేతల ఫలితంగా వచ్చేదికాదు గాని నా కళ్లకు అర్థమైకానట్టే కన్పించే రూపం గట్టయ్య.

వాడు స్కూల్లో చేరిన కొత్తలో మెరిసేకళ్లతోనే ఉండేవాడు.


పీలగొంతుతో "కొంతమంది ఎర్రగా కొంతమంది నల్లగా ఎందుకు పుడతారు సార్" అన్నప్పుడు పిల్లలు ఘొల్లున నవ్వారు.

"గొప్పవాళ్లంటే ఎవరు సార్"

వాడి ప్రశ్నలు ఎవరు పట్టించుకోనేలేదు. అవి నేను గుర్తుంచుకోలేదు కూడా.

కాని రమణ గట్టయ్యను వేటగాని చూపుతో ఎందుకు చూస్తాడో నాకు తెలిసేది కాదు.

ఒకనాడు బలంగా ఆరోగ్యంగా ఉన్న రమణ గట్టయ్యమీద కూర్చుండి గుద్దుతున్నాడు. నన్ను చూసి రమణ గట్టయ్య మీది నుండి లేచాడు.




గట్టయ్య నా ప్రియశిష్యుడు కాలేకపోయాడు. నా వృత్తిలో అంత ప్రతిభావంతమైన పేజీ గట్టయ్య కోసములేదు.

రమణకు, గట్టయ్యకు పోలికలటుంచి భిన్నధృవాల సారాంశం చావుబతుకుల సంకులసమరం పుట్టుకతోనే ఆరంభ మౌతుందని నా కప్పుడు తెలియదు. కాని కాలం పెనుఘర్షణ ల మయంకదా! - కాలగమనంలో ఈ నిజము దాగదు గదా!

రమణ ఆరోగ్యవంతమైన నున్నటి బుగ్గల్లో దాగున్నది అమాయకత్వంకాదని అతని తెలివితేటలు మానవులకు సుఖసంతోషాలు యిచ్చేవికావని - రమణ కొంటె ప్రశ్నల వెనుక, వ్యంగ్యము వెనుక వ్యాపార విలువలున్నాయని యాతనతో అర్థమయ్యింది.

కాని గట్టయ్య అమాయకత్వం వెనుక, ప్రశ్నలవెనుక, మౌనం వెనుక, పెనుగులాట వెనుక నిజాయితీగల స్వచ్ఛమైన ప్రేమదాగున్నదని, ఆ కళ్లవెనుక మానవజాతి పట్ల ఒక తీవ్రమైన పట్టింపున్నదని ఆలస్యంగా అర్థమయ్యింది.

రమణ చదువు మానేస్తే అయ్యో అనుకొని తల్లడిల్లిన నేను గట్టయ్య వెనుక బెంచీలో కన్పించకుంటే పిసరంతకూడా అప్పుడు స్పందించలేదు.

బడిమానేసిన గట్టయ్య రమణ బ్రాందీ షాపు బిల్డింగు పక్కనే కూలిపోయే స్థితిలో ఉన్న గుడిసెలో సైకిల్ టాక్సీ పెట్టాడు. వాడి రెక్కల్లాగే ఆ గుడిసె రేకుగ్రిల్ తలుపుల 'శిథిలావస్థలో ఉన్నాయి. ఆ గుడిసె కప్పు చీకి చింకి వాడితైల సంస్కారంలేని తలలాగే ఉంది.

నాలుగు పాత డొక్కు సైకిళ్లతో గట్టయ్య వృత్తి ప్రారంభమయ్యింది. అనేక రకాల చింతలతో, బాధ్యతలతో వాడి బతుకు మొదలయ్యింది. ఆ లేత రెక్కల మీద కుటుంబ భారం మోపబడినది.

రమణ తండ్రి వారసత్వాన్ని తన జవసత్వాలతో వృద్ధి చేయబూనుకున్నాడు. గట్టయ్య తన తండ్రి ఓటమిని తన బాధ్యతగా స్వీకరించాడు.

"సార్ మానాయిన బడికి వద్దన్నడు సార్!' నాకు నమస్కారం చేసి కళ్లు దించుకున్నాడు గట్టయ్య.

"మానాయినకు పని చేతనైతలేదు. మా కుటుంబంగడువాలంటే."నాకర్థమైంది.

బత కడంకోసం 'విద్య' ముఖ్యం. బడిలో నేను చెప్పే విద్య ఇద్దరికి పనికి రాదనుకున్నారు. వాళ్లిద్దరికి కావాల్సిన విద్య చెప్పడం నా వల్లకాదు. ఇద్దరు బడిమానుకున్నారు.

రమణ బ్రాంది షాపులో నిత్యం గ్లాసులు, కాసుల గలగలతో విద్య నారంభించాడు. రమణ పెట్టిపుట్టినవాడు గనుక

కూటికోసం కోటివిద్యలు గనుక అలాంటి విద్యల్లో సైకిల్ షాపు విద్య ఒకటని గట్టయ్య ఎంచుకున్నాడు. కాని అతని బతుకు దినదిన గండం నూరేళ్లాయుష్షు.

రమణ కౌంటర్ మీద కూర్చుంటే రోడ్డు మీద వెళ్లేవాళ్లంతా "నమస్తే రమణన్నా" అనే వాళ్లే.

"నమస్తే అన్నా!" గట్టయ్య రోడ్డు మీద వెళ్లేవాళ్ళందరిని ఆప్యాయంగా తనే పల కరించేవాడు.

రమణ అందరికి కావాల్సినవాడు. గట్ట య్యకు అందరు కావాల్సిన వాళ్లే. అందుకే వాళ్లిద్దరు బద్ధ శత్రువులయ్యారు. సైకిల్ షాపు పీకేయడానికి రమణ గట్టయ్యను వేధించే వాడు.

ఎంత వద్దనుకున్నా నా మనస్సు వారి ద్దమధ్య సామ్యాలను బేధాలను లెక్కిస్తుంది. ఒక్క క్లాసు విద్యార్థులేకాదు. ఒక్కసారే ఇద్దరు క్లాసు రూంలో నుండి బయటపడి ఒకడు భయంకర వ్యాధిలా మావూళ్లో విస్తరించాడు. మరొకడు చిన్న వయస్సులోనే తన పొట్టేకాదు - తనకుటుంబం పొట్టలు నింపడానికి జీవన పోరాటంలోకి దిగాడు.

తల్లి మనస్సు తన పిల్లల గురించే ఆలోచిస్తుంది. ఉపాధ్యాయుడి మన స్సు తన విద్యార్థుల గురించి ఆలోచిస్తుంది.

తూర్పు పడమరలుగా ఆరంభమైన రమణ, గట్టయ్య బతుకులు అక్కడే ఆగవు కదా!


మత్తు కావాలనుకునేవాళ్లు జనమే.

మత్తు వద్దనుకునేది జనమే.

రమణ వ్యాపారం మూడు సీసాలు ఆరు గ్లాసులుగా సాగుతుండగానే - సంఖ్యా పరంగా కొద్దిమందితో మొదలయ్యింది మత్తు వ్యతి రేకఉద్యమంగా చెలరేగింది. నీళ్లు చల్లే వాళ్లు న్నారు కాబట్టి మావూళ్లో నిప్పుచల్లారినట్టే కన్పించింది. కాని మావూరు చుట్టు పక్కల్లో గల అడవి ప్రాంతాలల్లో నిప్పురగులుతూనే ఉంది.

కాగలకార్యాలన్నిటిని తీర్చేవారు 'గంధర్వు లన్నట్లు' గంధర్వులు ఊళ్ళ నుండే అడవుల్లోకి చేరుకున్నారు. అలాంటి గంధ ర్వులనే 'అన్న' లంటారు. వాళ్లు అడవుల్లోనే కాదు ఊళ్లల్లో ఉన్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో గత ఇరవై సంవత్సరాలుగా అందరి నోళ్లల్లో ఉన్నారు.

రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ తలపట్టుకొని కూర్చుంటాడు. భూస్వాముల భూముల్లో, బంజరు భూముల్లో తెల్లారే సరికల్లా జండాలు - అన్నలు సర్వే నెంబర్లకు బదులు నిలు చుంటారు. అమీన్‌గారు ఆగమాగంగ తిరుగు తుంటారు. అతనికి తోడు పంజాబు కమెండో లదాకా వేలాది మంది బారుతు పాకులతో మావూళ్లల్లో కవాతులు చేస్తూనే ఉన్నారు. అరెస్టులు, సోదాలు, ఎన్‌కౌంటర్లు జరుగు




తూనే ఉన్నాయి. మున్సిపాబు కోర్టులో జనం వందలు వేలుకేసుల చుట్టూతిరుగుతూనే ఉన్నారు......ఇండ్లు విప్పడాలు, ధాన్యం నూతుల్లో పోయడాలు, ఇంతెందుకు ప్రతిరోజు ఊళ్లు వల్లకాడు లౌతూనే ఉంటాయి. అయి నా ఊళ్లల్లో మీటింగులు జరుగుతూనే ఉన్నాయి.

"అశోకుడు చెట్లు నాటించి నాటించి రోడ్లు వేయించి వేయించి - మా ప్రాణంమీదికి తెచ్చిండుగదా! అశోకుడు చచ్చి నరకానికే పోవాలె బంచత్ - రోడ్లు వేయించుడు అశోకుడు మొదలు పెడితే - ఆ రోడ్డులోపల మందు పాతరలు పెడుతండ్లు - " చరిత్ర పరిణామక్రమం తన పరివారానికి చెప్పి. సర్కిల్‌గారు రోడ్లు దున్నించే కార్యక్రమంలో లీనమైపోతారు.

జంగ్లాత్ చౌకిదార్, సారేదార్ల కైతే ఎండ కాలం రావద్దనే ఉంటుంది. బీడిఆకుల సేకరణ ఉండదు. అడవుల జోలి - అన్నల జికిరి తమకుండదు.

అడవి అన్నల చేతుల్లోకి ఏనాడో పోయిం ది. ఊళ్ళో జనం అన్ని సలహాలకు అడవి కేపోతున్నారు. మంచెల మీద చేలకావలి కాసే పిల్లలు రాత్రి మీటింగుల్లోని పాటలే పాడు తరు.

ఇతెందుకు అసెంబ్లీల్లో హాట్ హాట్ చర్చలు. పార్లమెంటులు, పారామిల్ట్రీదళాలు వాళ్లగురించే - ఎక్కె విమానం దిగేవిమానం ఢిల్లీ ప్రయాణాలు వాళ్లగురించే - అధికారం అటుమారినా - ఇటుమారినా వాళ్ల గురించిన ఆలోచనలు యథా తథమే.

ఎన్నో విధాలుగా పల్లె నుండి ఢిల్లీ దాకా చాలా చాలా మందికి కష్టం వచ్చిపడింది. ఆ కష్టంపేరు అన్నలు.

సేర్ కృష్ణమూర్తి అదే రమణ తండ్రికి కూడా అలాటి ఉపద్రవం వచ్చిపడ్డది.

ఉపద్రవం పేరు అన్నల ఉత్తరం. అది మూడో ఉత్తరం.

కృష్ణమూర్తి గతంలో వచ్చిన రెండుత్తరా లను ఖాతరు చెయ్యలేదు. చుట్టూ భవంతులు - పైగా పోలీసులు - జడ్జీలు, నాయకులు వగైరావగైరా తనకేమిటి అనుకున్నాడు. అథవా తన ముగ్గురు కొడుకులకు చూయించలేదు. పైగా ఆ రెండుత్తరాలు బహుమర్యాదగానే రాశారు అన్నలు. మూడో ఉత్తరంలో మర్యాదలు లేవు - ఎక్కువ మాటలు లేవు.

"బ్రాందీ షాపు బందు పెడతారా లేదామీ లో ఒక్కరు చస్తారా?" కనుక ఈ చివరి హెచ్చ రిక చూయించక తప్పలేదు.

ముగ్గురు కొడుకులు ఆ ఉత్తరం చదువు కున్నారు. కృష్ణమూర్తి కొడుకుల ముఖం చూడ కుండా మేడ మీది నుండి జలగలాగా పడి ఉన్న రోడ్డు మీదికి చూస్తూ నిలుచున్నాడు. అవులమలిపే అర్జునుడు కొడుకుల్లో ఎవడన్న ది ప్రశ్న.

"నాకీ విద్యచాలు . నేను కిరాణం నడుపుకుంట" పెద్దవాడు.

"బతికుంటే బలుసాకుతిన దల్చుకు న్నాడు. పిరికివాడు. కిరాణ ంలో పోటీ పెరిగి - అథవా అందులోకి 'వాళ్లు' రారని గ్యారంటే మిటి?" కృష్ణమూర్తి మన సులో.

"నావాటానాకు పంచియ్యండి - ట్రాన్స్ పోర్టు వ్యాపారం డెవలప్ చేసుకుంటాను." రెండవవాడు.

"వీడు పారిపోదలుచుకున్నాడు" కృష్ణమూర్తిలో లోపల కొత్తగా కొడుకులను చూస్తున్నాడు. ఎవడికివాడు బతుకు మొదలు పెట్టినపుడు ఎవనికాళ్లమీద వాడు నిలబడమ న్నప్పుడు మనిషి పడిపోతాడో నిలబడతాడో తెలుస్తుంది.

"చావు ఎప్పుడైనా ఎక్కడైనా వస్తుంది". రమణ.

కృష్ణమూర్తి చిన్నకొడుకు ముఖంలోకి మాత్రమే చూశాడు.

"వీడు - నిలబడ్డడు కూలిపోవడం ఎక్కడో ఆపకపోతే కృష్ణమూర్తి ఉండదు. అతని

కొడుకులుండరు. చనిపోవడంఖాయమే అని తెలిసినా అభిమన్యుడు యుద్ధరంగంలోకి నడవక తప్పదు" కృష్ణమూర్తి ఎవరికి జవాబు చెప్పలేదు.

కాని అతనిలోపల .....భయంతొలుస్తూనే ఉన్నది.

ఆ సమావేశం ముగిసింది.

రమణ చావుకు సిద్ధపడ్డాడు. బహుశా చావుల చివరి మజిలీ చేరుకోదలుచుకున్నాడు. ఏది ఏమైనా కృష్ణమూర్తి సేఠ్ వ్యాపారం నడపక తప్పదు.

కృష్ణమూర్తికి వ్యాపారం నడిపించాలనే పట్టుదల ఉన్నది. రమణకు అందరు భయపడి బందు చేసుకున్న వ్యాపారంలోనే సంపాదించాలని పట్టుదల ఉన్నది. పట్టుదల పెద్దలకుంటుంది. పిల్లలకుంటుంది.

పట్టుదల మంచివాళ్లకుంటుంది. చెడ్డ వాళ్లకుంటుంది. పట్టుదల యుద్ధరంగంలో మొహరించిన ఇరువక్షాలకుంటుంది. పట్టుదల రమణకున్నదని తెలిసి అన్నలకు పట్టుదల వచ్చింది.

ఉదయం ఏడుగంటలు - మూసుకుపోయిన ఆకాశం. తుప్పర తుప్పరవాన చినుకులు.

ఎప్పటిలాగే జలగదేహంమీద జారిపోతూ రోడ్డుమీద జనం తిరుగుతున్నారు.

రమణ బ్రాంది షాపు ముందు జనం గుమిగూడారు.

రోడ్డుమధ్యలో ఎర్రటి రక్తం నల్లబారి - ఆ రక్తంలో బొక్కబోర్లపడి రమణ శవం... ..ఈగలు ముసురుతున్నాయి. ఎర్రటి రక్తం చినుకులకు ఇంకా పలుచనై రోడ్డు పక్క మురుగు కాలువలో కలిసిపోతోంది.

పాలమ్మేవాళ్లు, కూరగాయలమ్మేవాళ్లు, కూరగాయలకోసం మార్కెటుకుపోయే వాళ్లు - జీబులు, కార్లు ఆ ఎర్రని ద్రవాన్ని తొక్కుకుంటూ పోతూనే ఉన్నాయి. రాత్రి పదకొండు గంటలకు జరిగిందట. నడిరోడ్డు మీద అదీ పట్నంలో జరిగినా చచ్చిన వానితో ఏమి పని అనుకున్నారేమొ ఇంకా రావాల్సిన వాళ్లు రాలేదు.

చిత్రంగా ఎవరు ఏమీ మాట్లాడడంలేదు. ఆ చావు అందరికి ముందే తెలిసినట్టు - ఆచావు ఎప్పుడో ఇంతకు ముందే అందరు చూసినట్లు - ఎవరు అక్కడ ఆగడంలేదు. ఎంతచిత్రంగా ఇక్కడి మనుషులకు చావులు బతుకులో భాగమైపోయాయి. చావుల స్పృహ అందరు ఎప్పుడు ఎట్లా కోల్పోయారు?

రమణ కోసం ఎవరు ఒక్కకన్నీటి చుక్క కూడా ఒదలరా? వాడికోసం ఆగరా? ఒక్క నిమిషం ఆలోచించరా?

ఈ యాంత్రికత అంతరార్థమేమిటి?

అందరి ముఖాలల్లో వెతికాను. ఆరాటం - ఏదో వెతుకులాట. నేను చదువుకున్న చదువులో - నే చెప్పిన పాఠాలల్లో ఎక్కడ ఆ ముఖాలు - ఆ ఆరాటం, వెతుకులాట లేవు. వీళ్లంతా భాషకందని - నాకు చెప్పరాని చదువు లేవో చదువుకుంటున్నారు. నా అనుభవానికి అందనిదేదో ఇక్కడ జరిగి పోతోంది.


చుట్టూ కలియజూసి భారంగా నేను అక్కడినుండి కదిలాను.

నడుపుతున్నాయి కనుక అతనికి రమణ గురించే ఆలోచించే తీరికలేదు.

రమణను కన్నతల్లికి మాత్రమే రమణ బతుకుచావు అర్థంకాకున్నా కన్నపేగు కనుక ఇంకా ఏడుపు ఆపలేదు.

రమణ చావును అందరు మరిచిపోయిన్న కారణాలు చెప్పి 'నేరస్థులను' పట్టుకోవాల్సిన వాళ్లు మరిచిపోవడానికి వీల్లేదు కదా! వాడిచావు చాలామంది చావు కొచ్చింది.

అందుకో మరెందుకో - ఆ రోడ్డంటే నాకు భయం. అందుకో మరెందుకో ఆ తారురోడ్డు నాకు జలగలాగా శరీరంలో చిత్రమైన జలదరింపు కలిగిస్తుంది.




పదిహేను సంవత్సరాలకిందటి రమణ ముఖం. కౌంటర్ ముందు కూర్చున్న రమణ ముఖం. అన్ని భావాలు తేటతెల్లంగా స్పష్టంగా కన్పించే రమణ ముఖం కండరాలతో కొవ్వుతో లావెక్కిన రమణ ముఖం.

ఆ రక్తం పదిహేను సంవత్సరాల క్రితమే వక్కదారిపట్టింది. అరక్తం ఇపుడిపుడే చనిపోయిన మనిషి రక్తంకాదు. అరక్తం రోజు రోజు శ్రమలో పునీతమైన రక్తంకాదు. ఆ రక్తం గడ్డకట్టిన శ్రామిక జీవుల పీల్చి పిప్పి చేసిన రక్తం. అరక్తం సహజరక్తంకాదు.

ఏరక్తాన్ని నేను తొక్క దలుచుకోలేదు. జాగ్రత్తగా రక్తం కలిసిన వాననీరు పారని ఎగువ ప్రాంతం గుండా అక్కడి నుండి బయటపడ్డాను.

కాగల కార్యాన్ని గంధర్వులు తీర్చారు.

ఆవుల మలిపిన వాడి అన్నదమ్ములు నిద్రాహారాలు మానలేదు. వారెంచుకున్న దారులు అంతప్రమాదం అప్పుడేరానివి కనుక వాళ్లు బతికేస్తున్నారు.

రమణ భార్య హైద్రాబాదు నుండి రానేలేదు. రమణ మరణం బతుకు ఆమెకు అర్థమే కాలేదు కనుక.

రమణ తండ్రి యితర వ్యాపారాలు ఆపలేదు. వ్యాపారాలు అతన్ని

ఇప్పుడు ఆరోడ్డు మామూలుగానే ఉన్నది. ఇప్పుడు ఆరోడ్డు మీద ఏమి జరుగనట్టే - మరిచిపోయినట్టే - జనం తిరుగుతూనే ఉన్నారు.

బ్రాంది షాపు షట్టర్ మూసేఉంది.

దాని పక్కనే గల సైకిలు షాపు రేకుగ్రిల్ తలుపులు మూసే ఉన్నాయి.

రేకు గ్రిల్స్ నుండి గుడిసెలోపలి సామానులు బయటకు కన్పిస్తూనే ఉన్నాయి.

షాపులో పంక్చర్ వేయని సైకిల్లు ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్టున్నాయి. వాటివెనుక పరిచిన పక్కబట్టలు ఎత్తకుండా గత ఆరు నెలల నుండి అలాగే ఉన్నాయి. కర్రకు చుట్టన ఉప్పుకాగితం, ఖాళీ జిగురు ట్యూబ్, వాటిపక్కనే విరిగినమొండి కత్తెర, చిన్నా, పెద్ద పానలు చిందర వందరగా కోళ్లు కెలికిన పెంటలాగా, కుక్కలు చింపిన విస్తరి లాగా పడి ఉన్నాయి. అన్ని సామానుల మీద దుమ్ము పేరుకు పోయి ఉన్నది. ఆ గుడిసె దొంగలు దోచినట్లుగా ఉన్నది.

గుడిసె నిట్టాడుకు తగిలేసిన చిరిగిన ప్యాంటు, షర్టులు సొలెగూట్లు పెట్టి ఉన్నాయి.

మొత్తంగా అతిచిన్న ఆశల ప్రపంచమైన ఆ చిన్నగది ఎప్పటినుండో నిశబ్దంగా కూలి కుప్పై పోయే ఉన్నానాకెందుకో నేను చూసిన

ప్రతి సారి గమనంలో ఉన్నట్లే తోస్తుంది. నిష్కల్మషంగా నల్లటి ముఖమేదో ఆగదిలో రూపుకడుతూనే ఉంటుంది.

సైకిల్ టైర్లు పంక్చర్లు పూర్తయి రోడ్డుమీద పరుగెట్టినట్టు - ఆ పక్క మీద పడుకున్న మనిషి లేచిపోయి ఆ సైకిల్ టైర్లలో ఊపిరులూదినట్లు కన్పిస్తుంది.

రమణ చావు ఎప్పుడు ఆరంభమై ఎక్కడ అంతమయ్యిందో తేలక ముందే గట్టయ్య బతకడానికి సదా పెనుగులాడిన గట్టయ్యను బలవంతంగా చంపేసిన వైనం గుర్తొస్తుంది.

గట్టయ్య కరుడు గట్టిన తీవ్రవాది. వార్తా పత్రికలల్లో అధికార్లు ఆ మాటే ఉద్ఘాటిస్తారు....శ్రీరాంసాగర్ కాలువ ఒడ్డున తీవ్ర వాదుల సమావేశం జరిగినట్లు - పెట్రోలింగు చేసే స్పెషల్ పోలీసులకు ఎదురుపడి తుపాకి నుండి, సైకిల్ చైన్లదాకా సకల ఆయుధాలు ప్రయోగించి కూడా ఎదురు కాల్పుల్లో ఒరిగిపోయాడంటారు అధికారులు.

వార్తా పత్రికలు ఆమాటలే రాశాయి.

తనమిత్రుడు, తను కలిసి సైకిల్లమీద బయలు దేరడానికి సిద్ధపడుతుండగా.. ...ఎవరో నలుగురొచ్చి బలవంతంగా తీసుకపోతుంటే - వాళ్లెవరో తెలుసుకొని కాళ్లావేళ్ల బతిమిలాడినా విన్పించుకోకుండా పట్టుకపోయి - సాయం కాలం పోయిన మనిషి తెల్లారి శవంగా మారిపోయా దని - గట్టయ్య పిచ్చితల్లికి మాత్రమే తెలుసు ......

"రారా కొడుక - ఆకలంటివి అన్నంతిందువుగాని"అని పిలిస్తే లేచి వచ్చే శివుని భక్తుడైన సిరియాలుడు కాదు గట్టయ్య.

"తండ్రియాడాది మాసికానికి కోడిని తెత్త నని బయలుదేరిన కొడుకుఇంకా రాలే దని' గొనుక్కుంటూ ఎదురు చూస్తూనే ఉంటుంది.

తనకొడుకు తమకడుపులకు అన్నం పెట్టాడని తెలుసుకొని 'అన్నె'ప్పడయ్యాడో పిచ్చితల్లికి తెలియదు.

రమణ బ్రాంది షాపు బారుషాపు కావడానికి గట్టయ్య సైకిల్ షాపు అడ్డమొచ్చిందని ఆ షాపు మీద రమణ అనేకమార్లు దాడిచేసి బెదిరించినపుడు ఎవరు అడ్డం రాలేదు.

రమణ చావుకు లోపలి కారణాలేమున్నా అధికారులకు కావాల్సింది బయటి జవాబు. ఎవడైతేనేమి హత్యకు మరో హత్య. ఎక్కడైతేనేమి? ఎప్పుడైతేనేమి? కౌంటర్‌కు ఎన్‌కౌంటర్. ఈ యుద్ధంలో మరణాలు మామూలే. కాని రమణ గట్టయ్య మరణాల సారాంశం.

"శ్రీనివాస సార్! బలే పట్టేసిందయ్య వదిన. అన్నమునపటి అన్నకాదు. మీరేంటిసార్ ఎప్పుడు అదోలోకంలో" మాసాంఘిక శాస్త్రం సార్.

అయినాకాని నామనసు ఆ రెండు మరణాల చుట్టే పరిభ్రమిస్తూ ఉంటుంది. తేడాలు ఎంతగింజుకున్నా స్పష్టంకావు.

కాని పోలికలు.....

ప్రతి పండుగకు గట్టయ్య ముసలి తల్లి కోడిని కోసి గట్టయ్య వస్తాడని ఎదురు చూస్తూనే ఉంటుంది.

రమణ తల్లి రోజు మొదటి ముద్ద పిసికి రమణ కోసం పక్కకు తీసి పెడుతూనే ఉంటుంది.

☆ ☆ ☆

మా ఊరు పట్టణంగా మారిపోయింది. దుర్మార్గమైన ఈ అభివృద్ధి సామాన్యమైనదేమి కాదు..... మాపట్టణం ఇప్పుడు మరణాలను లెక్కచెయ్యని రణరంగక్షేత్రం.

ఇక్కడ బతుకు పద్మవ్యూహమైంది. ఇక్కడ జీవితం ఇంద్రధనుస్సులు కూలిన అగ్నిగుండమయ్యింది.

అటుఢిల్లీలో - ఇటు దండకారణ్యలో మా పట్టణంలో విద్యనేర్చిన వాళ్లే నాయకులయ్యారు.

బారులు తీరిన నక్షత్రమునుగుల భవనాలకప్పులకింద మనిషి రక్తం పీల్చే జలగ ఇంకా బలం పుంజుకుంటూనే ఉన్నది.

నెత్తురు పాని ఇంకిన మా పట్టణం రోడ్డుమీద నడుస్తుంటే ఆ రెండు బతుకులు - మరణాలు నాలోపల సుళ్లు తిరుగుతాయి.

☆ ☆ ☆

